క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



సోంపురం పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం జెడ్పీహెచ్ఎస్, ఓబలయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోద్దాం పీహెచ్‌సీ సిబ్బంది గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలను అందజేశారు. 3,4,5 తరగతుల వారికి పింక్ రంగు, 6 నుంచి 10వ తరగతివరకు విద్యార్థులకు నీలం రంగు ప్యాకెట్లు అందించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వప్నకుమారి, ఆశావర్కర్లు వసంత, శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వేపాడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రగతి నివేదికలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల నివేదికలు తీసుకుని సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి: ఐదుగురిపై కేసు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేకాట,కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా పెట్టి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి రూ.13,010 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

లేగదూడల ప్రదర్శన

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం లేగదూడలు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ పి.రామ్మోహనరావు ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా లేగదూడల సంరక్షణ, పాల దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, గొల్లుపాలెం, బొండపల్లి పశువైద్యాధికారులు జగన్మోహన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సైల్ మన్‌కు నివాళి



అబ్దుల్‌కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా, సిబ్బంది

కొత్తవలస: మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత, మిస్సైల్ మన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ఏపీజే అబ్దుల్‌కలామ్ వర్ధంతిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, డిప్యూటీ తహసీల్దార్ కోట అప్పారావు, ఆర్ఐ రాజేష్, కార్యాలయ సిబ్బంది కలాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే లక్కవరపుకోట మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

చీపురుపల్లి రూరల్: మండలంలోని పుర్రేయవలస గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కంది చిరంజీవి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పరిహారం కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబాలకు వైఎస్సార్ బీమా కొంత ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కంది అప్పారావు, కంది పాపినాయుడు, శిరేల రాములు, కంది శ్రీరాములు, అప్పలనాయుడు, సూరి తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

బొండపల్లి: మనం ఏ రంగంలో పనిచేస్తున్నా.. మనం అందించిన సేవలే మనకు గుర్తింపునిస్తాయని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. ఎంఈఓగా పనిచేసి ఇటీవల చీపురుపల్లి మండలానికి బదిలీపై వెళ్లిన ఎం.బూసినాయుడును స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని, విద్యార్థులను భావిభారత సంపదగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఎంఈఓ శోభారాణి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల్లో సంతోషం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వేపాడ: శింగరాయిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శంగరాయి గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ పేద కుటుంబం ఆనందంగా ఉందన్నారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరవేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, ఎంపీడీఓ పటాన్నాయక్, సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ టీవీ రమణ, ఏసీఎస్ మండల కన్వీనర్ బోజంకి శ్రీను, మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, స్థానిక నాయకుడు అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

గుర్ల: అర్హత ఉన్న ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పార్టీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని సొలిపిసోమరాజుపేటలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోళ్ల సుబ్రహ్మణ్యం, ఏఓ తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్.చింతలవలసలో..

దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురం సచివాలయం పరిధి ఎస్.చింతలవలస గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

'జగనన్న సురక్ష'తో సేవలు మరింత చేరువ

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఎస్.కోట సచివాలయం-4లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కొత్తవలసలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని పలువురు అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎస్.కోట: స్థానిక సచివాలయం-4లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారుకు రైస్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు



గుర్ల: జమ్ములో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ బంగారునాయుడు



కొత్తవలస: ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



లక్కవరపుకోట: గనివాడలో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



చీపురుపల్లి రూరల్: గరివిడి పట్టణంలోని కొండపాలెంలో జరిగిన కార్యక్రమంలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ వి.శ్రీనివాసరావు, తదితరులు



గజపతినగరం రూరల్: కెంగువలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తవుడు

చోడి సాగుతో ఆదాయం, ఆరోగ్యం

- జిల్లా వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు



రైతులకు చోడి విత్తనాలు అందచేస్తున్న జేడీ

దత్తిరాజేరు: రైతులు చోడి(రాగి)పంట సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. దత్తి ఆర్బీకే వద్ద ఏఓ అనురాధ అధ్యక్షతన చోడి పంట సాగుపై గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. చోడి సాగుతో ఆదాయంతో పాటు దీన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పల్లం, మెట్టు భూముల్లో తక్కువ ఖర్చుతో పంటను సాగు చేయవచ్చన్నారు. చోడిపంటను ప్రభుత్వం క్వింటాకు రూ.3840లు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం 20 మంది రైతులకు 2కేజీలు చొప్పున విత్తనాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, స్వాతి, డీఆర్సీ గోవిందమ్మ, ఏడీఏ మహారాజన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోడసింగి సత్తిబాబు, తలారి రామస్వామి, వీఏఏలు పాల్గొన్నారు.

స్పందించిన రెవెన్యూ అధికారులు

గంట్యాడ: సాగునీటి కాలువను కప్పేసి జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో పంట పొలాలు నీట ముంపునకు గురివుతున్నాయనే విషయంపై సాక్షిలో ఈనెల 25న 'సాగునీటి కాలువను పునరుద్ధరించరూ' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కొండతామరపల్లి వద్ద సాగునీటి కాలువ కప్పేసిన స్థలాన్ని ఆర్డీఓ ఆర్.వి.సూర్యకళ, తహసీల్దార్ ప్రసన్నరాఘవ, ఇరిగేషన్ డీఈ పాండు, ఏఈ తమ్మినాయుడు, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. సాగునీటి కాలువను ఇరిగేషన్ అధికారులు నిర్మించాలా లేదా ఎన్‌హెచ్ఏఐ ఏజెన్సీ వారు నిర్మించాలా అన్నది సాంకేతికంగా నిర్ధారించి 2,3 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఓ మణి

గజపతినగరం రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డీఎంఓ మణి సూచించారు. మురుగునీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులను వ్యాపింప చేస్తాయన్నారు. మరుపల్లి పీహెచ్‌సీని గురువారం ఆమె సందర్శించారు. సీజనల్ వ్యాధులపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. మలేరియా, డెంగీపై గ్రామీన ప్రజలను అప్రమత్తం చేయాలని, ఫీవర్ సర్వేని చేపట్టాలని సూచించారు.

సంతగవిరమ్మపేటలో పొలంబడి

శృంగవరపుకోట: మండలంలో సంతగవిరమ్మపేట గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ వరిసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారి నరేంద్ర రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంఈఓలు విమలమ్మ, చక్రధర్

గజపతినగరం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని ఎంఈఓలు విమలమ్మ, చక్రధర్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ వలంటీర్ల సాయంతో మరోసారి గ్రామాల్లో సర్వే చేసి బడి బయట పిల్లలను గుర్తించాలని సూచించారు. సీఆర్‌పీలు శ్రీనివాసరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే పీఎంకేఎస్ కేంద్రాలు

చీపురుపల్లి: రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను నెలకొల్పిందని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ గద్దే బాబూరావు అన్నారు. పట్టణంలోని మనగ్రోమోర్ ఎరువుల దుకాణంలో గురువారం పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పీఎం నరేంద్రమోదీ ప్రసంగాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం అన్నిచోట్లా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఒక్కో యూరియా బస్తాపై ప్రభుత్వం రూ.2 వేలు వరకు భారాన్ని మోస్తోందని వెల్లడించారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్‌వీఎల్ఎన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెపురి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, పార్టీ చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల అధ్యక్షులు ఇప్పిలి నీలకంఠం, త్రినాథ్, సరిది రామునాయుడు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చీపురుపల్లిరూరల్: మండలంలోని నిమ్మలవలస పంచాయతీ పరిధి గుణిదాం గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారని, ఆ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు రాకపోకలు సులభతరమవుతాయన్నారు. వారి వెంట మండల విప్ అధికార్ల శ్రీనుబాబు, బెల్లాన త్రినాథ్, కృష్ణ, చింతాడ లక్ష్మణ్, బంక రామకృష్ణ, భాష, భాస్కర్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలి

శృంగవరపుకోట: రామభద్రపురం పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ హెచ్చరించారు. కార్మికులకు మద్దతుగా పట్టణంలో దేవీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ 26 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులను చర్చల కోసం పిలిచి వారిపై దాడి చేయడం అన్యాయమన్నారు. కార్మికులపై దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సంఘం మండల అధ్యక్షుడు జి.గంగరాజు, పి.నాగరాజు, పైడిరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: రామభద్రపురం పంచాయతీ కార్మికులపై జరిగిన దాడికి నిరసనగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, రిక్షా కార్మికులు స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం రాస్తారోకో చేపట్టారు. కార్మికుల డిమాండ్లు నెరవేర్చి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

శృంగవరపుకోట: విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్రను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. పట్టణంలోని పుణ్యగిరి ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి సైకిల్‌యాత్ర ప్రచార పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి హర్ష మాట్లాడుతూ.. జూలై 30 నుంచి ఆగష్టు 9 వరకు పది రోజుల పాటు కొత్తవలస నుంచి విజయనగరం వరకు 400 కి.మీ సైకిల్‌యాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లాలోని మేధావులు, విద్యార్థులు, సానుభూతిపరులు తమకు మద్దతివ్వాలని కోరారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



గొల్లుపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. దేశంలోని ఏరాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అర్హులకు నేరుగా అందిస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గొల్లుపాలెం పంచాయతీ ఎస్సీకాలనీతో పాటు కిలపర్తివానిపాలెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 11 శాతం పేదరికం ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అది 6 శాతానికి తగ్గిందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో 30 పడకలుగా ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా రూ.17 కోట్లతో అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పనులు కూడా దాదాపుగా తుది దశకు చేరుకున్నాయన్నారు. గ్రామస్తుల వినతి మేరకు గొల్లుపాలెంను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో లోఓల్టేజీ సమస్య పరిష్కారంతో పాటు, కోనిస నుంచి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణ పనులను త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ పోతల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, రాచకిండాం, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్‌లు గొల్లు సతీష్, మహంతి రమణ, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కిలపర్తి సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ పల్లిరఘు, నాయకులు పోతల కన్నంనాయుడు, టి.సత్తిబాబు, మీసాల తులసీరాం, ఎంపీటీసీ గొండేల దేవుడమ్మ, మూకల చలంనాయుడు, తోత్తడి దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు ఉండరాదు

- కలెక్టర్ నాగలక్ష్మి



ఓటర్ల సవరణ వివరాలపై రామవరం కార్యదర్శిని ఆరా తీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గంట్యాడ: ఎవరికైనా ఒక్క చోటే ఓటు ఉండేలా చూడాలని, రెండు చోట్ల ఉంటే ఒకదాన్ని తొలగించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో చేపట్టిన ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. కరకవలస, రామవరం, పెణసాం, చినమానపురం, కొర్లాం, వసంత, కొండతామరపల్లి తదితర గ్రామాలకు సంబంధించి ఓటర్ల జాబితాలో సవరణలను తనిఖీ చేశారు. మార్పులు, చేర్పులపై ఆరాతీశారు. ప్రతీ ఇంటికి వెళ్లి కచ్చితమైన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. జాబితాలో ఇంటి నంబరు, చిరునామా నమోదు చేయాలన్నారు. డూప్లికేట్ ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించి ఏదో ఒక చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఓటు తొలిగించే ముందు అందుకు కారణాన్ని తెలియజేస్తూ తప్పనిసరిగా నోటీస్ ఇవ్వాలని అన్నారు. ఇచ్చిన నోటీసులను, వచ్చిన దరఖాస్తులను భద్రపరచాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నరాఘువ, డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణకుమార్, ఎలక్షన్ డీటీ సతీష్ పాల్గొన్నారు.

రాయితీపై టమాటాల పంపిణీ



ఎస్.కోట: రైతుబజార్‌లో రాయితీపై టమాటాల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మార్కెట్‌లో టమాటా ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా రాయితీపై టమాటాలను పంపిణీ చేస్తోంది. ఎస్.కోట రైతుబజారులో రాయితీపై టమాటాల పంపిణీని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఒక్కొక్కరికీ కిలో చొప్పున అందజేశారు. అనంతరం రైతుబజారులో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, దాని మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, పలువురు ఎంటీసీలు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో ఉన్న రైతుబజారులో రాయితీపై టమాటాల పంపిణీని ఈఓ కె.లీలావతి గురువారం ప్రారంభించారు. మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.125 వరకు ఉండగా రైతుబజారులో కిలో రూ.50లకే విక్రయిస్తున్నట్లు ఈఓ తెలిపారు. వినియోదారులు ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. ప్రస్తుతానికి వచ్చిన స్టాక్ పంపిణీ పూర్తయిందని, మరో రెండు రోజుల్లో స్టాకు వస్తుందన్నారు.

గంట్యాడ: స్థానిక రైతుబజారులో రాయితీపై టమాటాల పంపిణీని కొఠారుబిల్లి సర్పంచ్ వేమలి రమణమ్మ గురువారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.120 నుంచి రూ.130 వరకు ధర పలుకుతుండగా.. పేద, మధ్యతరగతి వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రాయితీపై రూ.50కే ఇస్తోందన్నారు.

చురుగ్గా ఓటర్ల జాబితా వెరిఫికేషన్



గుర్ల: పెద్దబంటుపల్లిలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ అప్పారావు



గంట్యాడ: మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నరాఘవ

గుర్ల: తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని ఆర్డీఓ అప్పారావు అన్నారు. మండలంలోని పెద్దబంటుపల్లిలో జరుగుతున్న ఓటరు సర్వేను ఆర్డీఓ అప్పారావు గురువారం పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాలని, సవరణలు, మార్పులు చేర్పులు ఉండే వెంటనే నమోదు చేయాలన్నారు. ఒక కుటుంబంలోని సభ్యులంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా జాబితాలు రూపొందించాలని బీఎల్ఓలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సూర్యనారాయణ ఉన్నారు.

గంట్యాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసన్న రాఘువ బీఎల్ఓలతో గురువారం సమావేశమై ఓటర్ల జాబితాల పరిశీలన, తప్పుల సవరణ, మార్పులు చేర్పులపై పలు సూచనలు చేశారు. చనిపోయిన వారి బంధువులకు నోటీసులు ఇచ్చి మృతుల ఓట్లను తొలిగించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ హరిప్రియ, సీనియర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో చేపట్టిన ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎం.సురేష్ గురువారం తనిఖీ చేశారు. పలువురు ఓటర్లతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాబితాలో ఉన్న పేరు, అడ్రస్, డోర్ నంబరు, ఆధార్ నంబరు తదితర వివరాలు సరిపోతున్నాయో లేదో క్షుణ్ణంగా వెరిఫై చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

వాహనమిత్ర అర్జీలపై సమీక్ష

వేపాడ: మండలంలో వాహన మిత్ర పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలపై ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్ సమీక్షించారు. తన కార్యాలయంలో గురువారం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. 355 మంది లబ్ధిదారుల రెన్యువల్‌తో పాటు కొత్తగా అందిన 90 దరఖాస్తులకు సంబంధించిన వెరిఫికేషన్‌ను పక్కాగా చేపట్టాలని సూచించారు.